ఆగస్టు 15

శ్రీమతి సమయమంత్రి రాజ్యలక్ష్మీదేవి

దండపాణి దేశిగర్ స్వాతంత్ర్య గీతాల్ని అద్భుతంగా ఆలాపిస్తున్నాడు. మధ్యమధ్య కాస్త ఓమాదిరిగా వున్నా, మా రేడియో, స్వతంత్రోత్సవం నాడు తన విధిని త్రికరణ శుద్ధిగానే నెరవేరుస్తూవుంది.

మహా స్వతంత్రుల్లా మావాళ్లు లిటరేచర్ హుషారుగా ఆడేస్తున్నారు, మధ్య మధ్య "అమ్మా! సుబ్బలక్ష్మి పాట వచ్చినప్పుడు చెప్పేం" అంటూ. వెర్రివాళ్లు! సుబ్బలక్ష్మి పాట వచ్చిందని చెప్తేనేగాని తెలియ నపుడు గాన కోకిల పాట అయినా ఒకటే, గమళ్ల గంగమ్మపాట అయినా ఒకటే ఆనందం పేకాటలో సీటివ్వలేదని అలిగారు చెల్లెళ్లు అవతల గదిలో కూర్చుని, "ఆంధ్ర రాష్ట్రము మనదేనోయ్" అని అతి సీరియస్‌గా పాడుతున్నారు, ఆదిలో అక్కర లేదన్న మదరాసు, మళ్ళీ కావాలని మదనపడుతూన్న మన ఆంధ్రత్వాన్నంతా జోడించి.

అపుడే మా భోజనాలయి, ఆంధ్ర పత్రికా, రిపబ్లిక్ భారతి దగ్గర పెట్టుకుని కూచున్నా రేడియోదగ్గర. ప్రొద్దుటి నుంచీ విశ్రాంతిలేదు. శరీరం అలసి పోయింది. ఎదుట కుర్చీలో పడుకుని చదువుతూంది మా అమ్మ. ఆంధ్ర రాష్ట్రోద్యమం పూర్వాపరాలూ, భగ్నజీవి కథానికా, ఇరిగేషన్ స్కీము, ఇత్యాదులన్నీ ఓసారి తిరిగేసా. ఆంధ్రోద్యమారంభంలో మనవారికి మదరాసు సంగతే పట్టలేదు. దాని అవసరం, పుట్టుపూర్వోత్తరాలు, దానిమజా, ఇప్పటికి తెల్సుకుని మధనపడుతున్నాం. రిపబ్లిక్ తీశా. "అదేమిటే అమ్మా! "ఓ బాపూ, స్వతంత్ర భారతిలో నీ అవసరంచాలా ఉంది సుమీ" అని వ్రాశారు?

"బాపూజీ భౌతిక శరీరాన్ని విడచినా, మనం వారిని శాంతముగా వుండనీయదలచ లేదు. బాపూజీ ఇంకా ఏం చెయ్యాలే మనకు? మనవాళ్లు అన్నం పెడితే తినలేరు. ఇంకా కలిపి తినిపించాలి కాబోలు!" అన్నాడు మా తమ్ముడు గెల్చిన అరకుసెట్టు దగ్గర పెట్టుకూంటూ. 'The Relentless Mother' చదువుతున్నా. కథబాగానే నడుస్తూంది. ఎటొచ్చీ, ఈ దినంస్వతంత్రదినం. అసభ్యశృంగారం, అందులో నాయిక దేవతామూర్తి. ఆంగ్లంలో కథ. కథేమో పూర్తి చేశాను. మా అమ్మ నవల చాలా సీరియస్‌గా చదివేస్తోంది. మావాళ్లు మధ్య మధ్య 'స్వతంత్రదినమోయ్' అంటున్నారు.

ఏమిటో! 20వ శతాబ్దంలో సగం గడుస్తుంది. ఇండియాకు స్వరాజ్యంవచ్చింది. మానవుడు ద్రష్ట లిఖితమైన ఈ సృష్టి మహా గ్రంథంలో ఆటం అధ్యాయం ఆరంభించాడు. కాని, మనం మాత్రం, 'మానవులు రావచ్చు, మానవులు పోవచ్చు—అయితే ఎప్పటికీ నాదారి నాదే' అన్నట్లు ఇంకా ఈ స్థూల దృష్టికి కనిపించే సౌందర్యానే ఆరాధిస్తున్నాం. అంగనల వయ్యారాన్నీ, అవయవ బింకాన్నీ, అసందర్భ ఘట్టాల్నీ, నాగరికులూ, అనాగరికులూ, కూడా సినీమాల్లో, నాటకాల్లో, కథల్లో, కావ్యాల్లో, పచ్చి పచ్చిగా, పశు ప్రాయంగా, వ్రాసిన దానిని చదువుతూ, చూస్తూ ఆనందిస్తున్నాం. ఇంకా కాశీ మజిలీలు కామరాజు కథలు అంటేపడి చస్తున్నాం. మనం స్వతంత్రులమై 3వ సం వచ్చింది. కాదు, 2 సం. లు వెళ్ళి పోయాయి. మనం ఏ విధంగా స్వతంత్రులం అయ్యాం? భౌతిక దాస్య విముక్తులమయి మూడు సంవత్సరాలయినా, పాశుడు గట్టిన భావదాస్యాన్ని మాత్రం కడగలేక పోతున్నాం బహుశా భారత ప్రజలకు ఆ శుభముహూర్తం రావటానికి అధమ పక్షం ఇంకా రెండు తరాలయినా గడవాలేమో! భారత దేశం ఎప్పుడో స్త్రీలను గౌరవించేదిట. కాని మధ్య యుగంనుంచి వ్యక్తిత్వం లేదు. స్త్రీఅంటే పురుషుడికి ఒక సైకిలూ, ఒక రిస్టువాచీ, ఒక వేళ్ళవుంగరము లాగ ఒక పనిముట్టు, ఒక అలంకారం. అయితే ఈ నీచాభిప్రాయాలకు పురుషుడి అవిద్య కారణమా? కాదు. పురుషులు తామెంత విద్యాజ్ఞానం ఆర్జించినా, తమనీజ ధర్మాని మాత్రం, తమకు అతి దూరంలో వుంచుకుంటున్నారు. మన దేశంలో ఎన్ని వుద్యమాలు వచ్చినా, ఎన్ని సంస్థలు పెట్టినా, ఎన్ని సంస్క—

రణాలు జరిగినా, ఎంత నాగరికత వ్యాపించినా, చివరకు దేశం స్వతంత్రం అయినా, పశుత్వం అభివృద్ధి అవుతూంది కాని, తగ్గటంలేదు. స్త్రీగృహానికి రాణీ కాదు. స్త్రీ గృహ దేవాలయములో మూగదేవత. ముందూ వెనుకా, తుదీ మొదలూ లేని త్యాగభారాన్ని వహించడమే ఆమె జీవయాత్ర...

దబదబ తలుపు చప్పుడయింది. ఊహా ప్రపంచంలోంచి వులిక్కిపడి లేచా. గానకోకిల గంధర్వగానం చేస్తూవుంది. మావాళ్ల పేకాటమజాలో గానకోకిలను గమనించనే లేదు. తలుపు విరిగి పోతానని చెప్తూంది. ఆ చప్పుడులో, తలుపు తీసా. మా నాన్నగారే. "అప్పుడే పూర్తిఅయ్యాయండీ స్వతంత్రోత్సవాలు" అన్నా. మా నాన్నగారు సాయంకాలం బయలుదేరేటప్పుడు "మా క్లబ్బులో విందు. 10½ అవుతుంది వచ్చేటప్పటికి" అని మా అమ్మతో అనగా విన్నా.

"ఆ! అయాయమ్మా" అన్నారు లాల్చీలైనుకు పెడ్తూ "బాగా జరిగాయీ," అంది మా అమ్మ పుస్తకం టేబిలు మీద పెట్టూ.

"ఓ ఫస్టుగా జరిగాయి. స్వరాజ్యం వచ్చిన మూడో సంవత్సరం నాటికి, సర్వసమానత్వం అమలులోపెట్టారు మా క్లబు వారు" అన్నారు.

"ఏం చేశారేమిటండీ" అడిగాను నేను వుత్సాహంగా.

"అమ్మా! మాధా కబళమండీ అమ్మయ్యగారూ" అంటున్నాడు ముష్టివాడు వీధిలో.

"చూడండి. ఇది మూడవ స్వతంత్ర ఉగాది. రాత్రి 9 అయింది. సాటి సోదరుడు, తోటి సోదరుడిని భవాన్ భిక్షాం దేహి అంటున్నాడు. ఇంకా ఎన్నాళ్ళో ఈగర్భ దరిద్రం?" అన్నారు నాన్నగారు.

అవును నిజమే. వూరంతా స్వతంత్ర దినం అని ఇంతో అంతో వుత్సాహంగా విలాసంగా గడుపుతూంటే, ఈ దరిద్రనారాయణులింకా ఒక పట్టెడు అన్నంకోసం దేవులాడుతూనే వున్నారు.

ఏమనుకుందో మా అమ్మ, గబగబా వంటిట్లోకి వెళ్ళి పళ్ళెం తెస్తుంది.

"ఏమిటది?" అన్నారు నాన్నగారు.

"ఏమీలేదు, అన్నం కూరా వేస్తున్నా వాడికి" అంది సగర్వంగా మా అమ్మ.

"నాన్నగారూ! పిండివంటలు ఏంచేశారండీ విందులో?" అన్నాడు మా తమ్ముడు నిద్రలో పక్కకి వత్తిగిలుతూ.

"చాలా చేశారమ్మా! 5, 6 రకాలు చేశారు. ఒరేయ్ ఆట మానేశి పడుకోండి మీరంతా" అన్నారు నాన్నగారు.

అంతే! సైరనుమోత విన్నప్రజానీకంలా ఎక్కడి వాళ్ళక్కడ గప్‌చిప్.

"అబ్బా! చాలా గ్రాఢంగా వుందన్న మాట" అంది మా అమ్మ చేతులు తుడుచుకుంటూ.

"అవునుగాని ఇప్పుడెవరయినా ఆకలితో అన్నార్థులు వస్తే ఏంచేస్తావు?" అన్నారు మా నాన్నగారు.

"ఏమిటీ అనేది? ఇందాకవుంది కనక పెట్టాం. ఇప్పుడు లేదు కనక పొమ్మంటాం" అంది ధీమాగా మా అమ్మ రెండో కుర్చీ ఆక్రమిస్తూ.

"ఇంతేనా! భారతస్త్రీలు అపర అన్నపూర్ణలాయెను. డొక్కా సీతమ్మగారు అన్నార్థి అర్ధరాత్రి వచ్చినా సరే అపుడు వంటచేసి పెట్టేదిగా!" అన్నారు నాన్నగారు పేపరు చదువుతూ.

"ఏమో! ఆ విడ ఎలా బాధ పడేదోగాని, అయినా, ఈ వేళ స్వతంత్ర దినమాయెను. ఒట్టిరోజుల్లో మాసెత్తి మీద రాతేగాని, ఈ రోజయినా మాకు హాయిగా వుండకుండా ఎవరు మళ్లా వండగలరండీ!" అంది మా అమ్మ విసుగుతో.

స్వతంత్రమంటే ఏమిటా అని ఆలోచిస్తునాం.

"అయితే పొమ్మంటావన్నమాట!"

"ఆ! తప్పకుండా!" అంది మా అమ్మ ధీమాగా.

"పోనీ! అప్పుడు నేనువండి పెట్టుతానండీ నాన్నగారు" అన్నాను.

"అయితే! నేనే ఇప్పుడు నిన్ను ,భవతీ భిక్షాందేహి" అన్నాననుకో, అప్పుడు నా గతేమిటి?" అన్నారు నాన్నగారు చిరునవ్వుతో.

"అబ్బా! ఏమిటండీ గొడవ. ఈ రోజు ఎంత సుదినం! హాయిగా సుబ్బలక్ష్మి గానం వినకూడదూ"

"అవును. ఏదో చద్ది అన్నంతిన్న ఆవిడ... అంటారు"

"అవునట నిజమే! ఫిండి వంటలతో మిఠాయిలతో షడ్రసోపేతంగా విందుకదూ, అందుచేత కడుపు నిండ లేదట!" అంది అమ్మ తమలపాకులు చీలుస్తూ.

"అన్నం తింటే కడుపు నిండుతుంది కాని, అదనాలు తింటే కడుపు నిండుతుందా అన్నాడొక బుద్ధిమంతుడు" అన్నారు నాన్నగారు లేచి రేడియో ధ్వని హెచ్చిస్తూ.

"అబ్బ! బుర్ర పోతూందండీ! అసలు సంగతేమిటో ఇవతలకు రానిద్దురూ. మీ చమత్కారమంతా ఇపుడే ఏకరు వెట్టాలా? ఇంతకీ మీరు వడ్డన బ్రాహ్మణులయారా యేం? సర్వీస్ అనుకుంటూ! అన్నం తిన్న కబుర్లే కనుపించటం లేదు!" అంది మా అమ్మ జంకుతో.

"అసలైన దారికొచ్చావు ఇప్పటికి. అక్కడ అన్నం వుంటేగా తినడం?" అన్నారు నాన్నగారు కొంటెగా నవ్వుతూ.

"అదేమిటండీ! విందుజరగలేదా?" అన్నాను అనుమానంతో.

"విందు జరిగిందిలే" అన్నారు.

"ఏం చేశారండీ ఇంత హంగామానూ?" అంది మా అమ్మ వెక్కిరింపుగా.

"అన్నంతప్ప అన్నీ చేశారు" అన్నారు నాన్నగారు అదోలాయాక్షన్ చేస్తూ.

"మరి అన్నం ఎందుకు వడ్డించలేదూ? శేషన్నా?" అంది అమ్మ.

"కాదండీ ఫామన్స్" అన్నారు నాన్నగారు నవ్వుతూ.

"మంచి ఫామన్స్ వచ్చాయండి! ప్రభుత్వమూ బాగా నేవుంది, పరిపాలనా బాగా నేవుంది. ప్రజల బుర్రతిరుగుడు అంతకన్నా బాగుంది. ఇల్లంతా పండించేస్తా నంటారు ఒకరు. తన ఆహారం తానే పండించుకుంటా నంటారు మరొకరు. ఆహారం దుర్వినియోగంచేస్తే దండిస్తా మంటారు ఇంకొకరు. కోట్లకొలదీ ధనాన్ని యుద్ధాలకు వెచ్చిస్తారు కాని కొన్ని లక్షలయినా ప్రాజక్టులకు మినహాయిస్తే, ఇంత మంది దరిద్ర నారాయణులు పట్టెడు కూటికోసం, పుట్టెడు చీకట్లో దేవురిం .."

"ఆగండాగండి! ఈ 'తెర మరుగున' కృతి మించి రాగాన్ని పడుతూంది. అయినా ఈ లెక్చరంతా నా మీద విసరకపోతే రాణీగారు రవంత తెల్ల కాగితాన్ని నల్లగాచేసి, మూడుకాన్ల బిళ్లముడుపుకట్టి, ఏ పత్రికకో పంపకూడదూ!" అన్నారు నాన్నగారు హేళనగా, "పాపం! పడతులు వ్రాస్తే ప్రాధాన్యాన్నిచ్చి, ప్రచురిస్తారు కదూ ఉండే పత్రికల్లో! సరేగాని, భోజనానికి లేద్దురూ!" అంది అమ్మ సీరియస్‌గా.

తలుపు తట్టుతున్నా రెవరో.

నాన్నగారే వెళ్లారు తలుపుతీసేందుకు.

"తాయారమ్మగారి భర్త కాబోలునే! తాళం చెవి యివ్వాలి" అంటూ అమ్మ వంటింట్లోకి వెళ్లింది.

పాపం! అసలే ఆయన రవంత పెద్ద మోతాదు మనిషి. ఆవిడేమో పుట్టింటికి, ఆయనేమో క్లబ్బుకి విందులకు వెళ్లారు.

"అమ్మాయ్! మాష్టారు ఇంటితాళం మన కిచ్చారా" అంటూ లోపలికి వచ్చారు నాన్నగారు

"ఆ! ఆయన్ని పిలవండి కాస్త భోజనం చేస్తారేమో. అసలే అన్నగత ప్రాణి పాపం! ఆవిడ రెండో ఆట సినీమాకు వెళ్లి తమ్ముణ్ణి తీసికుని వస్తానంది. వాళ్ళింట్లో ఏమీ వుండదు" అంది అమ్మ నెమ్మదిగా.

ఆసలు చాలా మొహమాటస్థుడాయన, కాని ఎన్ని తిన్నా రవంత అన్నం తింటేగాని వుండలేని రకం. ఏం చేస్తారు? ఆయన తత్వం అటువంటిది. లేక పోతే పైత్యం చేసి వాంతులు వెడతాయట.

వద్దన్నారు కాని ఎల్లాగో నాన్నగారు భోజనానికి వప్పించారు. రవంత మజ్జిగా అన్నమూ తీసికుంటారట వడ్డించమన్నారు. ఇంతకీ వాళ్లకీ మాకూ వున్న పరిచయం అటువంటిది కనక ఆయన 'ఊ' అన్నారు.

ఏదో రవంత మజ్జిగా అన్నంతో అతిధీ, గ్లానుడు చారుతో నాన్నగారూ, పిండివంటలకూ, మోడరన్ డిన్నరుకూ బుద్ధిచెప్పారు. "క్లబ్బులోవిందు వున్నప్పుడల్లా, ఇంటిదగ్గర వంటచేయించిభోజనం వుంచాలని ఇక్కణ్ణుంచి చెప్పుకోవాలి", అనుకుంటూ ఆ అతిధి తాళంచెవి పుచ్చుకుని వెళ్లారు.

"అన్నం లేదన్నావ్. ఎవరైనా వస్తే పొమ్మంటానన్నావు! మళ్లా ఎలావచ్చింది?" అన్నారు నాన్నగారు, తమలపాకులు వేసుకుంటూ.

"చెప్పుకోండి చూదాం" అన్నాను నేను.

"ఆర్యావర్తపు స్త్రీలు అన్నపూర్ణ అన్నారు గదండీ! ఇంతకీ మీదీవన అటువంటిది. వెంటనే ఫలించింది" అంది అమ్మ నవ్వుతూ.

"అబ్బ చెప్పుదూ, నీ మహాత్యమే అని ఒప్పుకుంటాం"

"ఏమీలేదండీ! అన్నటైము కన్నా త్వరగా రావటం, వెటకారంగా మాటాడటం, మాధాకవళం వేస్తుంటే ఏమిటని అడగడం చూస్తే అనుమానం వేసింది. ఎందుకేనా మంచిదని అరసోలెడు బియ్యం కుంపటి మీద పడేశా. అంతే నండీ!" అంది నవ్వుతూ.

"సూక్ష్మగ్రాహివి! మాట దక్కించావు. పాపం! ఆ బ్రాహ్మడు రేపల్లా బాధపడును" అన్నారు, రేడియో ఆపుచేస్తూ.

★

స్వాతంత్ర్య జ్యోతి

శ్రీమతి పొణకా కనకమ్మ

నవ స్వతంత్ర మహా మహోత్సవ రథమ్మె
విమల కల్యాణ రాజ మార్గముల దిరుగ
వచ్చె దినమణి ప్రాభాత వర్తనముల
అమ్మ! నీచేతి కాగడాయై—వెలుంగ.

విశ్వ సాగర కల్లోల వీచి లోన
నవ్య భారత స్వాతంత్ర్య నౌకద్రిప్పి,
విజయ తీరాల లంగరు విడియ నదిగో,
ఖరకరుడు వచ్చె తల్లి! చుక్కాని పట్టె!

ఈ మహానంత యాన మందే యమోఘ
పరమ సౌభాగ్య సీమ జూపగనో? స్వయము
పుష్పకము దెచ్చి యంజలి మోడ్చి, లోక
బాంధవుడు నిల్చె జనని! స్వాగతముల.

ఇది స్వతంత్ర మహా జ్యోతి ఈ యశేష
భువనముల కేక దీపిక పుణ్య భార
తోర్వి నుదయించె ప్రాగ్గోళము జ్వలింప,
జయము! భారత జనయిత్రి! జయము! జయము!!

సత్యమును ధర్మమును నహింసయును ప్రేమ
త్యాగమును పంచ ప్రాణములై స్వరూప
మవతరించిన బాపూ మహాత్మ తేజ
మెప్డుడు ముందయి మము నడిపించు గాక!!

శ్రీ కస్తూరిదేవి విద్యాలయములో స్వాతంత్ర్యోత్సవమునాడు విద్యార్థినులు చదివినది 15-8-49.

★